జెస్సీరాజ్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - దెందులూరు

అంతర్జాతీయ స్కేటర్, ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డు గ్రహీత మాత్రపు జెస్సీరాజ్‌కు ఘన స్వాగతం లభించింది. దక్షిణ కొరియాలో జులై 24 నుంచి 29వ తేదీ వరకు జరిగిన 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో సోలో డ్యాన్స్ - సబ్ జూనియర్ విభాగంలో రజత పతకం గెలుచుకున్న అనంతరం దేశానికి తిరిగొచ్చిన జెస్సికి దేశ ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. జెస్సీని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రదాత (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు సత్కరించి అభినందనలు తెలిపారు. క్రీడలో ఆమె భవిష్యత్ ప్రయత్నాలకు ప్రభుత్వం నుంచి తన పూర్తి మద్దతును అందించారు. ఆమె కోచ్‌లు సింహాద్రి, టీమ్ ఇండియా కోచ్ ఆదేశ్ సింగ్ వారి అద్భుతమైన శిక్షణ మార్గదర్శకత్వం కోసం ఆయన ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. జెస్సీ ప్రయాణంలో వారి నిరంతర ప్రోత్సాహం, నిబద్ధతకు ఆమె తల్లిదండ్రులను కూడా అభినందించారు.

ఆ పనులు.. మృత్యు పాశాలు..!

165 జాతీయ రహదారిపై
రాకపోకలకు జనం బెంబేలు
కానరాని హెచ్చరిక బోర్డులు
కాంట్రాక్టర్ అంతులేని నిర్లక్ష్యం
అధికారుల ఉదాశీన వైఖరి
వెరసి వాహనదారుల ప్రాణాలు బలి

హెచ్చరిక బోర్డులు లేకుండా ప్రమాదకరంగా నిలిచిన పనులు

ప్రజాశక్తి - మండవల్లి

పనుల్లో ఎడతెగని జాప్యం.. అడుగడుగునా అంతులేని నిర్లక్ష్యం.. వెరసి ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇది కైకలూరు నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారి 165పై దుస్థితి. జాతీయ రహదారి పనుల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు ప్రమాదాలు బారిన పడి మృత్యువాత పడుతున్నారు. లింగాల గ్రామ పరిధిలో అసంపూర్తిగా వదిలేసిన జాతీయ రహదారి పనుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గత బుధవారం చోటు చేసుకుంది. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల 165వ జాతీయ రహదారి విస్తరణ పనులు మూడేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల వంతెనల వద్ద, మలుపుల వద్ద రహదారి అభివృద్ధి చేయకుండా కాంట్రాక్టర్ వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పనులు అసంపూర్తిగా ఉన్న చోట్ల, వంతెనల వద్ద ప్రమాద సూచిక బోర్డులు పెట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కన్పిస్తోంది. దీంతో ముదినేపల్లిలో కారు ప్రమాదంలో మాజీ శాస్త్రవేత్త మృతి చెంది రోజులు గడవక ముందే లింగాల వద్ద అసంపూర్తిగా వదిలేసిన కల్వర్టు వద్ద యువకుడు మృతి చెందడం ఈ మార్గంలో రాకపోకలంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. పనుల నిర్వహణలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పట్ల అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తుండటంతో ప్రజల ప్రాణాలకు ముప్పు తప్పడం లేదు. లింగాల వద్ద ప్రమాదం జరిగిన తర్వాత తూములను ఏర్పాటు చేసి పేపర్ టేపులను అతికించడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే ఈ పని చేసి ఉంటే ఒక నిండు ప్రాణం బలి కాకుండా ఉండేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని విస్తరణ పనులకు అమాయక వాహనదారులు బలి కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎన్‌హెచ్ ఎఇ శరత్‌ను వివరణ కోరగా జాతీయ రహదారి విస్తరణ పనుల వల్ల వాహనదారులు మృతి చెందడం విస్మయానికి గురి చేస్తుందన్నారు. ముదినేపల్లిలో ప్రమాదం సంభవించి సైంటిస్ట్ మృతి చెందిన ఘటన మరువకముందే లింగాల వద్ద కల్వర్టు ప్రాంతంలో ద్విచక్ర వాహదారుడు మృతి చెందడం బాధాకరమని తెలిపారు. పనులు నిర్వహించే ప్రాంతాల్లో, అసంపూర్తిగా వదిలేసిన చోట తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని హెచ్చరించినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

అస్తవ్యస్తంగా తయారైన రహదారి

మచ్చుకు కొన్ని ప్రమాదాల వివరాలు:

1.అధికారుల బాధ్యతారాహిత్యం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఫలితంగా జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన డ్రెయినేజ్ పనుల వల్ల కూలీ మృతి చెందిన ఘటన మండవల్లిలో చోటుచేసుకుంది.

2.రహదారి కోసం తీసుకొచ్చిన తారును నిర్లక్ష్యంగా రోడ్డుకు అడ్డంగా గుట్టగా వేయడంతో ద్విచక్ర వాహనదారుడు అది కన్పించక గుట్టపైకెక్కి పడిపోయిన ఘటనలో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన భైరవపట్నం వద్ద చోటుచేసుకుంది.

3.రోడ్డు పక్కనే కంకర, రబ్బీష్ గుట్టలను నిర్లక్ష్యంగా ఏర్పాటు చేయడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన కంకర గుట్టలను ఢీకొని ఒక పాస్టర్ మృతి చెందిన ఘటన పెరికెగూడెం శివారు కొల్లపాడు రోడ్డు సమీపంలో జరిగింది.

4.అసంపూర్తిగా వదిలేసిన రహదారి ప్రాంతంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ముదినేపల్లి వద్ద కారు అదుపుతప్పిన ఘటనలో శాస్త్రవేత్త మృతి చెందారు.

5.లింగాల డ్రాప్ వద్ద రహదారి విస్తరణ పనులు సగం మాత్రమే చేసి హెచ్చరిక బోర్డులేవీ పెట్టకపోవడంతో రహదారి ఉందని అనుకొని ముందుకెళ్లడంతో లారీ బోల్తా పడి డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు.

6.రోడ్డుపై కల్వర్టు నిర్మాణానికి గొయ్యి తవ్వి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఆ గోతిలో పడిన కారులో పలువురు గాయాల పాలైన ఘటన ప్రత్తిపాడు స్టేజీ ఎద్ద చోటుచేసుకుంది.

కల్వరు నిర్మాణానికి తవ్విన గోతిలో పడిన కారు (ఫైల్‌ఫోటో)

ఏడాదిలో 75 శాతం హామీలు నెరవేర్చాం

పింఛన్ల పంపిణీలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఏడాది కాలంలో 75 శాతం హామీలను నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండల పరిధిలోని తోటపల్లిలో జరుగుతున్న ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలంలో 9,637 మందికి రూ.4,17,48,500 కోట్లు అందించనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు తమ సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.ఝాన్సీ, గ్రామ సర్పంచి ఎ.శ్రీపద్మ, టిడిపి మండలాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు ఎన్.వేణు, కె.సాంబశివరావు, ఎ.శ్రీనివాసరావు, ఎన్.రాంబాబు, ఎం.రామకృష్ణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ అందిస్తున్న మంత్రి పార్థసారధి

పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలి
కొత్తగా 4,358 స్పౌజ్ పెన్షన్లు విడుదల
పంపిణీలో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు : ప్రభుత్వం మంచి లక్ష్యంతో అందిస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. శుక్రవారం ఏలూరు నగరంలోని 37, 38 డివిజన్లలో ఆర్‌ఆర్‌పేట, గుబ్బలవారి వీధిలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. నేరుగా పలువురు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్‌దారుల యోగక్షేమాలను, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల నుంచి కొత్తగా 4,358 స్పౌజ్ పెన్షన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ఏదైనా కారణంతో పెన్షన్ తీసుకోలేని వారికి శనివారం పంపిణీ చేస్తారని తెలిపారు. వీరి వెంట డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, తహశీల్దార్ గాయత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు నాయుడు సోము, ఈతకోట శ్రీనివాసరావు, ఎస్.దుర్గాప్రసాద్ ఉన్నారు.

పింఛన్ అందిస్తున్న కలెక్టర్

సమస్యలు అడిగి తెలుసుకున్న కలెక్టర్

నగరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాంతాల్లో స్థానిక సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఆర్‌పేట, గుబ్బలవారి వీధుల్లో పర్యటించిన ఆమె ప్రజలతో నేరుగా మాట్లాడి తాగు నీటి సరఫరా, డ్రెయిన్ల నిర్వ హణ, కార్పొరేషన్ నుంచి రోజు చెత్త తీసుకెళ్తున్నారా లేదా తదితర అంశాలను అడిగి తెలుసు కున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

ట్రంప్ సుంకాలపై కేంద్రం స్పందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి ఏలూరు అర్బన్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలకు దీటుగా కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 25 శాతానికి అదనంగా సుంకాలు వసూలు చేస్తామని భారతదేశంపై తన అగ్రరాజ్య ఆధిపత్యాన్ని చూపిస్తున్నాడని తెలిపారు. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురు వల్ల ఈ సుంకాలు విధిస్తున్నానని ట్రంప్ ప్రకటించడం తన అహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ప్రకటనపై ఇప్పటివరకు భారతదేశ ప్రభుత్వం గాని, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం గాని ఎటువంటి స్పందన తెలపకపోవడం బాధాకరమని తెలిపారు. ట్రంప్ మేకపోతు గాంభీర్యానికి చైనా, రష్యా, ఇతర కొన్ని చిన్న చిన్న దేశాలు దీటుగా సమాధానం చెబుతుంటే విశ్వగురు అని, ట్రంపు తనకు మిత్రుడని చెప్పుకునే దేశ ప్రధాని మోడీ మాత్రం కిమ్మనకుండా ఊరుకోవడం దేనికి సంకేతమని పేర్కొన్నారు. ట్రంప్ సుంకాల ఫలితంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ప్రధాన పరిశ్రమగా, ఆదాయాన్ని తెచ్చిపెట్టే పరిశ్రమగా ఉన్న ఆక్వా రంగ పరిశ్రమ కుదేలైపోతుందని తెలిపారు. తద్వారా ఆక్వా రైతులతో పాటు ఆక్వా రంగంపై జీవిస్తున్న అనేకమంది కార్మికులు రోడ్డున పడతారని పేర్కొన్నారు. ఈ ప్రభావం కేవలం ఆక్వా రంగంపైనే కాకుండా ఇతర అనేక రంగాలపై కూడా చూపుతుందని పేర్కొన్నారు. అమెరికా తాటాకు చప్పుళ్లకు భయపడకుండా ట్రంపునకు గట్టిగా సమాధానం చెప్పాలని, అధిక సుంకాల వల్ల ఇబ్బంది పడే రంగాలను ఆదుకునేందుకు, ముఖ్యంగా ఆక్వా రంగాన్ని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

రిలే నిరాహార దీక్షలు విరమణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎల్‌టిఆర్ వివాదాలు జరుగుతున్న భూములను ఆర్‌అండ్‌ర్ కొనుగోలు చేయటం ఆపాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం విరమించారు. దీక్షలో కూర్చున్న జగ్గిశెట్టిగూడెం గ్రామస్తులకు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి గణపవరం పంచాయతీ పరిధిలోని జగ్గిశెట్టిగూడెం, రెడ్డిగణపవరం, పాలకుంట గ్రామాల్లో 30 ఏళ్ల నుంచి సాగు చేస్తున్న ఎల్‌టిఆర్ 1/70 చట్టం, జిరాయితీ భూములను ఆర్‌అండ్‌ఆర్‌లో అమ్మకాలు చేయాలని గిరిజనేతరులు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇందుకు బుట్టాయగూడెం రెవెన్యూ అధికారులు కమీషన్ల కోసం వివాద భూములు ఆర్‌అండ్‌ఆర్ పెట్టాలని చూస్తున్నారని, వెంటనే ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో డిటి రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జగ్గిశెట్టిగూడెం గ్రామస్తులు ఉనుముల సూర్యచంద్రం, ఉనుముల బాబూరావు పాల్గొన్నారు.


డిటికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

ఏలూరులో...

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి

వాటి వల్ల ప్రమాదంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి
ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో కొనసాగిన సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రమాదకర స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 5న విద్యుత్ భవనం వద్ద జరిగే ధర్నాలో పాల్గొనాలని ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ప్రజలకు పిలుపునిచ్చింది. శుక్రవారం స్థానిక పత్తేబాద ఏరియాలో స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎఐటియుసి నాయకులు ఉప్పులూరు హేమశంకర్, సిఐటియు జిల్లా నాయకులు పంపన రవి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలు అడగకుండా మరింత దోపిడీ చేయాలనే దురుద్దేశంతో స్మార్ట్ మీటర్లను బిగిస్తోందని విమర్శించారు. ఛార్జీలు తగ్గిస్తామని, భారాలు వేయబోమని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని, సిఐటియు టౌన్ కార్యదర్శి కనకారావు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజావేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ఐదో రోజు శుక్రవారం పాత చింతలపూడి గ్రామంలో కొనసాగింది. అక్కడ ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ నెల ఐదో తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీలు, సంఘాల నేతలు ఆర్‌వి.సత్యనారాయణ, డి.సత్యనారాయణ, తొర్లపాటి బాబు, బోడ వజ్రం, కంచర్ల గురవయ్య, దొంతా కృష్ణ, ఎం.లాజర్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం తొమ్మిదిసార్లు కరెంటు ఛార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం వేసిందన్నారు. కరెంటు బాదుడు ఉండదని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిందని, ఉన్న ఛార్జీలను తగ్గించకపోగా మరిన్ని భారాలు మోపడం, స్మార్ట్ మీటర్లను బిగించడం దారుణమన్నారు. తక్షణం స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం దుర్గారావు, సిరిబత్తుల సీతారామయ్య, జానకీరామిరెడ్డి, బిక్కిన వీరసత్యం, సుంకవల్లి శేషగిరిరావు, గుర్రం వసంతరావు, వీరంకి నరేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దుచేయాలని ప్రజాసంఘాల నేతలు గుడెల్లి వెంకట్రావు, బిఎన్.సాగర్, కారం భాస్కర్ డిమాండ్ చేశారు. సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నాయకులు ధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు మడకం కుమారి, సుధారాణి, సిరిబత్తుల సీతారామయ్య, కొండముచ్చు శ్రీనివాసరావు, పూసం సూర్యారావు తదితరులు ఉన్నారు.

కుక్కునూరు : మండలంలో సిపిఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, సహాయ కార్యదర్శి కూరాకుల బాబూరావు పాల్గొన్నారు.

బోధనేతర పనులతో కుస్తీ..
విద్యాబోధనకు సుస్తీ..!

ప్రభుత్వ తీరుపై గురువులు గరంగరం
యాప్, ఆన్‌లైన్ నమోదు పనులతో అవస్థలు
12వ పిఆర్‌సి కమిషన్ కోసం ఎదురుచూపులు
ఒక్క డిఎ కూడా ఇవ్వకపోవడంపై
ఉపాధ్యాయుల పెదవివిరుపు
నేడు ఫ్యాప్టో ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఒకప్పుడు పాఠాలు చెప్పడంలో బిజీబిజీగా ఉండే గురువులు నేడు యాప్, ఆన్‌లైన్ పనులతో కుస్తీ పడుతున్నారు. పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయిస్తూ ఉపాధ్యాయ వృత్తినే అవమానిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయులు గరంగరంగా ఉన్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ల వద్ద ధర్నాలకు సిద్ధమయ్యారు.

ప్రభుత్వ విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం విద్యారంగ మూలాలను దెబ్బతీసేలా ఉపాధ్యాయులను విద్యాబోధనకు దూరం చేస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. గురువులపై బోధనేతర పనుల భారం రోజురోజుకీ పెరుగుతుండటం గమనార్హం. దీనిపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నారు. ప్రతిరోజూ వాటాప్‌లో అర్జెంట్, మోస్ట్ అర్జెంట్ అంటూ మెసేజీలు, ఆన్‌లైన్ పనులు చేయాలని ఆదేశాలిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 1428 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు ఏడు వేల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలు పున్నప్రారంభమయ్యాయి. ఆ తర్వాత స్కూల్ ఆర్గనైజేషనల్ టీములు (ఎస్‌ఒటి), ఎంటిఎస్, బదిలీల కౌన్సెలిం గ్ నిర్వహణతో 15 రోజులు గడిచిపోయాయి. అనంతరం గిన్నిస్ రికార్డు పేరిట జూన్ 21న చేపట్టిన యోగాంధ్ర కోసం పాఠశాలల్లో ముందస్తు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఉపాధ్యా యులను, విద్యార్థులను భాగస్వాములను చేశారు. గత నెల 10న నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ (పిటిఎం)కు పది రోజులు ముందుగానే సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి ముగించుకుని హమ్మయ్యా.. అనుకునేసరికి ఈ నెల 14 నుంచి స్కూల్ లీడర్‌షిప్, ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) వంటి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఇటువంటి వాటితో తమ సమయం వృథా అవుతోందని, అనివార్యంగా బోధనకు దూరమవ్వాల్సి వస్తోందని ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఓపక్క ఉపాధ్యాయులు అనేక రకాల పనులతో సతమతమవుతుంటే విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు సైతం సమయం సరిపోను పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యారంగం, దానిలోని పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది.

ఒకపక్క యాప్, మరోపక్క ఆన్‌లైన్ పనులు

పాఠశాల విద్యాశాఖలో ఉన్న అన్ని యాప్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి లెర్నింగ్ ఎక్సెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) యాప్ రూపొందించారు. దానిలోనే ఐఎంఎంఎస్, స్టూడెంట్ కిట్స్, మెగా పిటిఎం వంటివన్నీ ఉంచారు. సర్వర్ సక్రమంగా లేకపోవడంతో ఆన్‌లైన్‌లో టీచర్ ఫొటో హాజరు నమోదు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలస్యమవుతోంది. మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం అందిస్తున్నారు. ప్రతి నెలా పాఠశాలకు అందిన అన్ని బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్‌లను ఉపాధ్యాయులు స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. వంటకు ముందు ఆ బస్తా తెరిచిన ప్రతిసారీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, బియ్యం నాణ్యతను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. బియ్యం, సరుకులు, యూనిఫారం, పాఠ్య పుస్తకాల వంటివి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి తెచ్చుకోవడం తదితర పనులను ఉపాధ్యాయులే చేయాల్సి వస్తోంది. వివిధ పనులకు సంబంధించి ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు 500 నుంచి వెయ్యి వరకూ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. ఇంటర్‌నెట్, సర్వర్ సమస్యతో ఇవి ఏ సమయానికి అప్‌లోడ్ అవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీని వల్ల టీచర్ల సమయం వృథా అవుతోంది. లీడర్‌షిప్ ట్రైనింగ్ రెండో విడత నిర్వహిస్తున్నారు. మండలస్థాయిలో హెచ్‌ఎంలు, ఎంఇఒలు గంటల తరబడి ఈ సమావేశాల్లో పాల్గొనాల్సి వస్తోంది. ఈ నెల 4 నుంచి ఎఫ్‌ఎ-1 పరీక్షలు ఉన్నందున సిలబస్ పూర్తి చేయాల్సి ఉందని, ఈ సమయంలో తమపై ఇన్ని బోధనేతర పనులు మోపడమేమిటని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొజిషన్ ఐడీలు రాక రెండు నెలల జీతాలు పెండింగ్

బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ముగియడంతో జిల్లావ్యాప్తంగా దాదాపు రెండు వేల మంది ఉపాధ్యాయులు ఆయా ప్రాంతాలకు వెళ్లారు. గతంలో రెగ్యులర్‌గా జీతాలు తీసుకుంటున్నప్పటికీ బదిలీ అనంతరం మరో స్థానానికి వెళ్లడంతో వారికి ప్రభుత్వం పొజిషన్ ఐడీ కేటాయించాలి. ఇది జరిగితేనే సిఎఫ్ఎంఎస్‌లో వారి వివరాలు కన్పిస్తాయి. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకూ పొజిషన్ ఐడీలు కేటాయించకపోవడంతో సుమారు 17 వందల మందికి జీతభత్యాలు నిలిచిపోయాయి. బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డిఇఒకు సమాచారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. మోడల్ ప్రైమరీ స్కూల్, అప్‌గ్రేడ్ చేసిన ఉన్నత పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నచోట అదనంగా మరో మూడు పోస్టులు ఇచ్చారేగాని, పొజిషన్ ఐడీలు కేటాయించలేదు. దీంతో ఆయా ఉపాధ్యాయులకు జీతాలు రాక వారంతా సతమతమవుతున్నారు. బదిలీ అయిన వారికి జూన్, జులై జీతాలు రాని పరిస్థితి. దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కలెక్టరేట్ వద్ద నేడు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నాలకు ఉపాధ్యాయులు సన్నద్ధమయ్యారు. ఈ నెల రెండో తేదీ శనివారం భీమవరం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేపట్టనున్నారు. 12వ పిఆర్‌సి, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సిపిఎస్ రద్దు, యాప్‌ల భారం తగ్గించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్లతో చేపట్టే ఈ ధర్నాకు పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆయన ధర్నాలో ప్రత్యక్షంగా పాల్గొనున్నారు.

ఆర్థికపరమైన సమస్యలు పరిష్కరించాలి..

బొర్రా గోపీమూర్తి, పిడిఎఫ్ ఎంఎల్‌సి

గత ప్రభుత్వం ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టి అవమానించిందని, తమ ప్రభుత్వం వస్తే ఉపాధ్యాయులను గౌరవంగా చూస్తామని ఆనాడు ప్రస్తుత పాలకులు ప్రకటించారు. అయితే ఈ ఏడాదిలో ఉపాధ్యాయుల గౌరవాన్ని మరింత దిగజార్చారు. పాఠశాలలు తెరిచి రెండు నెలలవుతున్నా ఉపాధ్యాయులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పాఠాలు చెప్పే పరిస్థితి లేదు. అనేక పథకాలను ఆన్‌లైన్ చేయాలంటూ బోధనేతర పనులు అప్పగించి మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. మరోవైపు హ్యాండ్‌బుక్స్ పేరు చెప్పి విద్యకు దూరం చేస్తున్న పరిస్థితి ఉంది. 2023 జులై 30వ తేదీతో 11వ పిఆర్‌సి అయిపోయింది. తర్వాత 12వ పిఆర్‌సి ఇవ్వాల్సి ఉంది. తమ ప్రభుత్వం ఎన్నికైతే మంచి పిఆర్‌సి ఇస్తామని చెప్పి నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు చెప్పారు. అధికారంలోకొచ్చి సంవత్సరమైనా ఇప్పటి వరకు దాని ఊసేలేదు. వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్ వేసి మధ్యంతర భృతి ప్రకటించాలి. ప్రభుత్వం వచ్చి ఏడదవుతున్నా ఒక్క డిఎ కూడా ఇవ్వలేదు. ఇప్పటికే నాలుగు డిఎలు పెండింగ్లో ఉన్నాయి. సరెండర్ లీవులు పెట్టుకుని మూడేళ్లవుతుంది. ఇన్‌కమ్ ట్యాక్స్‌లు కూడా కట్టుకున్నారు. రిటైరైన ఉద్యోగులకు గ్రాట్యూటీ ఇప్పటివరకు ఇవ్వలేదు. తక్షణం ప్రభుత్వం సంఘాల నాయకత్వాన్ని పిలిచి చర్చించి డిమాండ్లను పరిష్కరించాలి.

కార్పొరేషన్ అధికారుల నిరంకుశత్వం..!

సచివాలయ భవనం తరలింపులో నిబంధనలు బేఖాతర్
శనివారపుపేట-2 సచివాలయ సామగ్రి కరెంటు లేని వేరే భవనానికి తరలింపు
ఉద్యోగులు పెన్షన్ పనిలో ఉండగా ఇష్టానుసారంగా వ్యవహారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కార్పొరేషన్ అధికారుల నిరంకుశత్వం పరాకాష్టకు చేరింది. ఎటువంటి సమాచారం లేకుండా శనివారపుపేట-2 సచివాలయ భవనం ఖాళీ చేయించిన తీరు అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఒకటో తేదీ శుక్రవారం సచివాలయ ఉద్యోగులందరూ పెన్షన్ పంపిణీ చేస్తూ ఉండగా అకస్మాత్తుగా సచివాలయానికి కార్పొరేషన్ అధికారులు వెళ్లినట్లు తెలిసింది. అక్కడ ఉద్యోగులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సచివాలయంలోని సామాన్లన్నీ పీకి పక్కన పడేశారు. ఈ భవనం వేరే అవసరాలకు ఉపయోగిస్తామని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ఉద్యోగులకు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. నిర్మాణం చేసి కనీసం విద్యుత్ సౌకర్యం లేని దగ్గర్లో ఉన్న రైతుభరోసా భవనంలోకి వెళ్లాలని తెలిపినట్లు తెలిసింది. ఆ భవనం దుమ్ము, ధూళితో నిండి, ఫ్లోరింగ్ పలుచోట్ల దిగబడి గోతులు పడింది. అది ఏమాత్రం అనుకూలంగా లేదు. సచివాలయ ఉద్యోగులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు.


గుట్టగా వేసిన సామాన్లు

ఆర్‌బికెలో కరెంట్ లేకపోవడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. రాజకీయ నాయకుల అండతోనే కార్పొరేషన్ అధికారులు ఈ విధంగా చేసినట్లు తెలుస్తుంది. ఓ సచివాలయ భవనం ఖాళీ చేయించాలంటే ముందుగా దానికి సంబంధించి సమాచారం ఇవ్వాలి. కార్పొరేషన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేయాలి. అలాంటివేమీ లేకుండా నిరంకుశంగా సచివాలయ భవనాన్ని ఖాళీ చేయించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

శాంతించిన వరద గోదావరి

గుండేటి వాగు కాజ్‌వే వీడిన ముంపు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

వారం రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వచ్చిన గోదావరి వరద శాంతించింది. గురువారం భద్రాచలంలో 27 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం శుక్రవారం నాటికి 22 అడుగులకు చేరుకుని పూర్తిగా తగ్గుముఖం పట్టింది. వరద తగ్గటంతో కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వే ముంపు నుండి బయటపడింది. దీంతో వాగు అవతల గల గ్రామాలకు రాకపోకలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. గోదావరి వరద తగ్గటంతో మండల ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

గుండేట వాగు కాజ్‌వే పై నుంచి వెళ్తున్న వాహనం

వేలేరుపాడు రూరల్ : వారం రోజులుగా భద్రాచలం వద్ద గోదావరి 36 అడుగుల దాకా ప్రవహించి శుక్రవారం నాటికి 26 అడుగులకు చేరుకోవడంతో మండల ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. గోదావరి వరద తగ్గడంతో ఎద్దువాగు వద్ద ఉన్న ఎద్దు వాగు కాజ్ వే ముంపు నుంచి బయటపడింది. ప్రజలు రాకపోకలు సాగుతున్నాయి.

పోలవరం :పోలవరం ప్రాజెక్టు ఎగువన గోదావరి నీటిమట్టం తగ్గింది. గోదావరి ఎగువ నుంచి ఆనకట్టకు వస్తున్న 4,03,425 క్యూసెక్కుల గోదావరి జలాలను జలవనరులశాఖ అధికారులు స్పిల్ వే నుంచి దిగువకు విడుదల చేశారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణరావు

ప్రజాశక్తి - నిడమర్రు

మాట్లాడుతున్న నారపల్లి రమణరావు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనపల్లి ఏఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం భువనపల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో గొర్ల సూరిబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి రమణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తూ 1214 మెమో రద్దు చేసి, కూటమి నేతలు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. లేబర్‌సెస్ సెప్టెంబర్ 15వ తేదీన భవన నిర్మాణ కార్మికులను సమీకరించి, రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం గౌరవాధ్యక్షులుగా గొర్ల సూరిబాబు, అధ్యక్షులుగా రోళ్ల ఏసురెడ్డి, కార్యదర్శిగా నత్తి విష్ణుకుమార్, కోశాధికారిగా కోసూరి శివ, కమిటీ నాని, శంకు సురేష్, పోలిశెట్టి ఏసులతో కమిటీ ఎన్నికైంది.

విద్యార్థికి కుల ధ్రువీకరణ పత్రం అందించాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విద్యార్థికి కుల ధ్రువీకరణ పత్రం అందించాలని కోరుతూ కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి కుంజ ప్రణీత్ మాట్లాడుతూ కుల ధ్రువీకరణ ఇప్పించేలా చర్యలు తీసుకుని నా చదువుకు ఆటంకం లేకుండా చూడాలని కోరాడు. ఫ్రాన్సిస్ మాట్లాడుతూ కుంజ ప్రణీత్‌కు కుల ధ్రువీకరణ పత్రం లేక తల్లికి వందనం రావడంలేదని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రణీత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎంఎల్ఎ బాలరాజు తహశీల్దార్‌కు ఫోన్ చేసి కుంజా ప్రణీత్‌కు సర్టిఫికెట్ పరిశీలించి చదువుకు సహకరించాలని ఆదేశించారు.

సిఐటియు ఆలిండియా మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - భీమడోలు

మాట్లాడుతున్న లింగరాజు

విశాఖపట్నంలో డిసెంబర్ 31వ తేదీ నుంచి జనవరి నాలుగో తేదీ వరకు జరిగే సిఐటియు ఆలిండియా మహాసభను విజయవంతం చేయాలని విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు కోరారు. భీమడోలు సిఐటియు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం భీమడోలు మండల ఆరో మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి బెండి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా లింగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వివిధ అంశాల గురించి వివరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కె.పోచమ్మ, అంగన్వాడీ యూనియన్ భీమడోలు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు స్వర్ణకుమారి మాట్లాడారు. కె.వెంకటేశ్వరరావు గత మూడేళ్ల నివేదికను సమర్పించారు. ఇటీవల చనిపోయిన సిఐటియు మండల కార్యదర్శి సాల్మన్ రాజు చిత్రపటానికి లింగరాజు పూలమాలవేసి సత్కరించారు. అనంతరం సిఐటియు మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో కన్వీనర్‌గా కె.వెంకటేశ్వరరావు, కో-కన్వీనర్లుగా బెండి శ్రీనివాస్, పద్మతోపాటు మరొక 15 మందితో కార్యవర్గం ఎన్నికైంది.

ఉపాధ్యాయ వృతికి వన్నె తెచ్చిన సారమ్మ

ప్రజాశక్తి - మండవల్లి

ఉపాధ్యాయురాలు సారమ్మ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారని పలువురు టీచర్లు కొనియాడారు. మండలంలోని తక్కెళ్లపాడు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన సారమ్మను మండవల్లి విద్యాశాఖ తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి సారమ్మ ఎంతో కృషి చేశారని అన్నారు. ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి అనివార్యమని చెప్పారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆమె జీవితం సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. మండవల్లి మండల విద్యాశాఖలో సిర్‌పిగాగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన స్మారక కుమారిని కూడా ఘనంగా సత్కరించారు. కాంట్రాక్ట్ ఉద్యోగం కావడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం కలగకపోవడంతో ఉపాధ్యాయులు కృతజ్ఞతా భావంతో కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజలు మురికి కాలువల్లో చెత్త, అన్నం వేయకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తద్వారా అంటువ్యాధులను నివారించుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అమృతం సూచించారు. స్థానిక గజ్జలవారి చెరువు పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో 1, 2, 3 సచివాలయాల పరిధిలో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిశుభ్ర పరిసరాల వల్ల దోమలు, ఈగలు వృద్ధి అనేక వ్యాధులు సంభవిస్తాయన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించి ప్రజలకు కరపత్రాలు ద్వారా అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

చెరువులో పడి యువకుడు మృతి

మండవల్లి : ప్రమాదవశాత్తూ కాలుజారి చేపల చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని భైరవపట్నంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామచంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం... భైరవపట్నం గ్రామానికి చెందిన పండు జోజి కూలి పనులు చేసుకుంటూ ఉంటాడు. ఆయనకు పండు తరుణ్‌కుమార్ (23), క్రాంతికుమార్ ఇరువురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు తరుణ్ (చందు) మద్యానికి, వ్యసనాలకు బానిసయ్యాడు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన చందు తిరిగి రాలేదు. రాత్రికి కూడా రాకపోవడంతో భయాందోళన చెందిన తల్లిదండ్రులు అతని ఆచూకీ కోసం బంధువుల ఇళ్ల వద్ద, స్నేహితుల ఇళ్ల వద్ద చూశారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం పండు జోజి ఇంటి వెనుక ఉన్న వీరబాబు చేపల చెరువులో తరుణ్ మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకుని కుటుంబీకులతో మాట్లాడారు. రాత్రి సమయంలో కాలుజారి చెరువులో పడి చనిపోయి ఉంటాడని తండ్రి పండు జోజి ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

తల్లిపాల సంస్కృతిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జాహ్నవి అన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు కొనసాగే తల్లిపాల వారోత్సవాలను గుండుగొలనులో అంగన్వాడీ కార్యకర్త బి.రాజామణి, సెక్టార్ పర్యవేక్షకులు ఎం.కవిత సంయుక్త ఆధ్వర్యంలో శుక్రారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైద్యులు మాట్లాడుతూ తల్లిపాలకు మద్దతుగా స్థిరమైన తల్లిపాల వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పూళ్ల సెక్టార్ పరిధిలోని అంబరుపేటలో సెక్టార్ పర్యవేక్షకులు నూర్జహాన్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాన్ని శుక్రవారం ప్రారంభించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

ఉంగుటూరు : అంగన్వాడీ కేంద్రాల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు తప్ప ఏ ఇతర ద్రవపదార్థాలు తాగించకూడదని తెలిపారు. తల్లిపాలు బిడ్డ శరీరానికి, మెదడుకు కూడా పోషణను ఇస్తుందన్నారు. తల్లి పాలలో పోషక గుణాలు ఉంటాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, సరస్వతి, రామలక్ష్మి, నిర్మల, రత్నం, మల్లేశ్వరి, అరుణ, ఆశాకార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు, తల్లులు పాల్గొన్నారు.

భీమడోలులో...

ఏలూరు సిటీ : తల్లిపాలు బిడ్డ హక్కు అని ఐసిడిఎస్ పీడీ శారద అన్నారు. ఏలూరులోని చోడిదెబ్బ పెద్దింటి వారి వీధి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ పీడీ శారద ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్ డాక్టర్ మల్లికార్జునరావు, సూపర్‌వైజర్ మౌనిక, నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు డి.నాగదేవి, డిఎస్‌డి భవాని, ఆశావర్కర్లు, అంగన్వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

ముసునూరు : పుట్టిన బిడ్డకు తల్లి పాలే ఆరోగ్యమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని చెక్కపల్లి, ముసునూరు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలను తాగించాలన్నారు. తల్లిపాలు శిశువును న్యూమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు, తల్లులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని బాపునగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిడిపిఒ విజయకుమారి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను, ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ దొరమామిడి సెక్టర్-1లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బుట్టాయగూడెం ఐసిడిఎస్ సిడిపిఒ యువివిఎన్.పద్మావతి, సూపర్‌వైజర్ వై.వెంకటలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

సామాజిక పెన్షన్లను సద్వినియోగం చేసుకోండి


ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఎటువంటి ఆటంకాలు లేకుండా సమయానుకూలంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. స్థానిక 40వ డివిజన్‌లో చేపట్టిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డివిజన్‌లోని అర్హుల ఇళ్లకు వెళ్లి వారికి పెన్షన్ సొమ్ము అందించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పౌజ్ పెన్షన్లను పంపిణీ చేశారు. ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు.

కొయ్యలగూడెం :పొంగుటూరు పంచాయతీలో నూతనంగా తొమ్మిది స్పౌజ్ పెన్షన్లు మంజూరైనట్లు పంచాయతీ సెక్రటరీ తెలిపారు. మండల వ్యాప్తంగా 180 వితంతు పెన్షన్లు మంజూరు కాగా కూటమి నాయకుల సమక్షంలో అందిస్తున్నట్లు తెలిపారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశరరావు, పగడం సౌభాగ్యవతి, పాతూరి అంబేద్కర్, బొబ్బర రాజ్‌పాల్, చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, కంపా రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో శుక్రవారం కొత్తగా మంజూరైన భాగస్వామ్య (స్పౌజ్) పింఛన్లను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ హామీ మేరకు పట్టణంలో సుమారు 100 కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

భీమడోలు : స్పౌజ్ పింఛన్ లబ్ధిదారులకు ఆపద వచ్చిన వెంటనే అండగా నిలిచిన కూటమి ప్రభుత్వ సేవలు అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలానికి నూతనంగా మంజూరైన 252 స్పౌజ్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం గుండుగొలనులో ప్రారంభించారు.

ఉంగుటూరు : ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు మండలంలో గ్రామగ్రామాన కూటమి నాయకులు ఉత్సాహంగా పంపిణీ చేశారు. ఎంఎల్ఎ ధర్మరాజు ఉంగుటూరులో కొత్తగా మంజూరైన పింఛను సొమ్మును పట్వాడా చేశారు. నారాయణపురంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌తో పాటు స్పౌజ్ పెన్షన్ల పంపిణీలో, సర్పంచి అలకనంద, మాజీ ఎంపిపి గొలి శ్రీనివాసరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు సుబ్బారావు, టిడిపి ఎస్‌సి సెల్ మండలాధ్యక్షుడు నేకూరి ఆశీర్వాదం పాల్గొన్నారు.


చింతలపూడిలో...

ముసునూరు : మండలంలోని 16 గ్రామపంచాయతీల పరిధిలో 136 నూతన పెన్షన్లు ఆయా గ్రామాల టిడిపి నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, ముసునూరు సర్పంచి కొండేటి విజయలక్ష్మి, ఉప సర్పంచి తోట శ్రీను, పార్టీ గ్రామ అధ్యక్షులు గార్లపాటి నరసింహారావు, సొసైటీ ఛైర్మన్ ఉప్పలపాటి గణేష్, నాయకులు దేవినేని డలరామ్, దేవినేని శ్రీధర్ బాబు, కొండేటి బాబి, తులిమెల్లి రంగారావు, నక్క యోహాన్, రాపర్ల బాలకృష్ణ, సూర్యదేవర శ్రీనివాసరావు, మేదరమెట్ల సురేంద్ర, గద్దల సుహాసిని మోహన్‌రావు పాల్గొన్నారు.

చింతలపూడి :మండలంలోని రేచర్ల గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక స్పౌజ్ పింఛన్ల పంపిణీలో ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పింఛనుదారులతో మాట్లాడి వారి యోగాక్షేమాలను, కుటుంబ వివరాలు అడిగి తెలుసు కున్నారు. రేచర్ల గ్రామస్తుల కోరిక నెరవేర్చామన్నారు. చింతలపూడి నుంచి రేచర్ల గ్రామానికి సుమారు ఐదు కిలోమీటర్ల మేర నూతన తారు రోడ్డు నిర్మించామని చెప్పారు.

జీలుగుమిల్లి :మండలంలోని బర్రింకలపాడులో మంజూరైన 55 పింఛన్లను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు లబ్ధిదారులకు అందించారు. మండల వ్యాప్తంగా 4,251 పెన్షన్లకు 3,959 పింఛన్లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధుశరణ్ తెలిపారు. మండలవ్యాప్తంగా 92.67 శాతం వరకు పెన్షన్ల ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు.

బుట్టాయగూడెం : మండలంలో నూతనంగా మంజూరైన 107 పెన్షన్లు అధికారులు, కూటమి నాయకులు కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా నాయకులు కరాటం సాయి చంద్రమోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జ్యోతి, బుట్టాయగూడెం పంచాయతీ కార్యదర్శి దేవా ప్రియుడు, సర్పంచి తెల్లం వెంకాయమ్మ, ఉప సర్పంచి కుందుల శ్రీను పాల్గొన్నారు.

మండవల్లి : పెన్షన్ అందుపుచ్చుకుని లబ్ధి పొందాలని కూటమి నాయకులు గుడివాడ చిట్టిబాబు కోరారు. మండవల్లిలో ఆయన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మెండ ఝాన్సీ శివయ్య, చంద్రశేఖర్, సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం : స్పౌజ్ పెన్షన్లను పోలవరం మండలంలో పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్ బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మండలంలోని తిరుమలంపాలెంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు లంక సత్యనారాయణ, సీనియర్ నాయకులు పాకలపాటి గాంధీ, ఏపూరి దాలయ్య, దేవరపల్లి వీరాస్వామి చౌదరి, ద్వారకాతిరుమల సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీను, తిరుమలంపాలెం సొసైటీ ఛైర్మన్ మాసిరెడ్డి హరిబాబు, జి.కొత్తపల్లి సొసైటీ ఛైర్మన్ రేగంటి రాంబాబు పాల్గొన్నారు.


జీలుగుమిల్లిలో..

కలిదిండి : మండలంలోని మట్టగుంటలో కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్ల పంపిణీలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు, కలిదిండి పంచాయతీ కార్యాలయంలో టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, సర్పంచి మసిముక్కు మారుతీ ప్రసన్న వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కుక్కునూరు : కుక్కునూరు గ్రామ పంచాయతీ పరిధిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచి పిచ్చుక రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు పిచ్చుక హరిబాబు పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న చంద్రబాబు

వైసిపి పిఎసి సభ్యుడు వాసుబాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అధికారం కోసం అమలు కాని వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరును ఎండకట్టాలని వైసిపి పిఎసి సభ్యుడు, ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ- రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో పేరిట ఆపార్టీ విస్తృత స్థాయి కార్యకర్తలు, నాయకుల సమావేశం శుక్రవారం ఉంగుటూరు కమ్మ కల్యాణ మండపంలో శునిర్వహించారు. మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా వాసుబాబు మాట్లాడారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎంపిటిసి సభ్యులు పెనుగొండ బాలకృష్ణ, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, ఎఎంసి మాజీ ఛైర్మన్ మరడ రమావతి, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, పుప్పాల గోపీ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక ఎనిమిదో డివిజన్ తూర్పు వీధిలోని సింహాల సందులో అగ్నిప్రమాద బాధితులను ఆర్‌టిసి రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు శుక్రవారం పరామర్శించారు. సింహాలసందులో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో వెన్నవల్లి తారక రామ్ ప్రసాద్ నివాసం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న నగదు, బంగారం, దుస్తులు, ఫర్నీచర్ సహా ఇతర వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న రెడ్డి అప్పలనాయుడు బాధితులను పరామర్శించి అన్ని విధాలుగా సహాయం అందించేందుకు జనసేన పార్టీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

'మంత్రి పార్థసారధిపై విమర్శలు తగవు'

ప్రజాశక్తి - ముసునూరు

నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఎనలేని కృషి చేస్తుంటే ఓర్వలేని వైసిపి నాయకులు విమర్శించడం అన్యాయమని నాగార్జునసాగర్ ప్రాజెక్టు వేంపాడు మేజర్ ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ అన్నారు. మండలంలోని కాట్రేనిపాడులో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధికి కృషి చేస్తున్న పార్థసారధిపై వైసిపి నాయకుల విమర్శల తగవన్నారు.

సూర్జిత్ స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్ స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ అన్నారు. శుక్రవారం సూర్జిత్ వర్ధంతి కార్యక్రమాన్ని ఏలూరు ఉద్దరాజు రామం భవనంలో నిర్వహించి ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్ అధ్యక్షత వహించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ మాట్లాడుతూ భగత్ సింగ్ స్ఫూర్తితో సూర్జిత్ స్వాతంత్ర పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్లారని చెప్పారు. అఖిల భారత రైతు సంఘం ఏర్పాటులో సూర్జిత్ పాత్ర మరువలేనదన్నారు. ఈ సభలో నగర కమిటీ సభ్యులు ఎం.ఇస్సాక్, జె.గోపీ, నాయకులు ఎస్.సత్యనారాయణ, రాజశేఖర్, త్రినాధరావు పాల్గొన్నారు.

మిడ్డే మీల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ స్కూల్ పిల్లలకు ప్రత్యేకమైన మెనూతో అందిస్తున్నారని, కాని పిల్లలకు ఇష్టమైన రీతిలో తయారుచేసి అందించే వర్కర్ల సమస్యలు తీరడం లేదని మిడ్ డే మీల్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి అన్నారు. మండలంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేస్తున్న మధ్యాహ్న భోజనం వర్కర్లను స్థానిక సిఐటియు బృందం, మొడియం నాగమణి శుక్రవారం కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ మిడ్ డే మీల్స్ వర్కర్లు పిల్లల కోసం ఎంతో శ్రమ పడుతున్నారన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వండి పెట్టే కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆటో యూనియన్ సభ్యులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పేరుతో మహిళలకు రాష్ట్రంలో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని, దీంతో ఆటో కార్మికులు ఉపాధిని కోల్పోతారని, వారికి ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మడివి దుర్గారావు, మిడ్డే మీల్స్ మండల కార్యదర్శి కన్నం నర్సమ్మ పాల్గొన్నారు.

వర్కర్లతో మాట్లాడుతున్న మొడియం నాగమణి

ఆక్వా చెరువులకు నీటిని మళ్లిస్తే చర్యలు

ఎఇఇ కెవి.సత్యనారాయణ

కాలువను పరిశీలిస్తున్న ఎఇఇ సత్యనారాయణ.

ప్రజాశక్తి - ముదినేపల్లి

పోల్‌రాజ్ పంట కాలువ నుంచి చేపల, రొయ్యల చెరువులకు నీటిని మళ్లిస్తే చర్యలు తీసుకుంటామని ముదినేపల్లి సెక్షన్ జల వనరుల శాఖ ఎఇఇ కెవి.సత్యనారాయణ తెలిపారు. పోల్‌రాజ్ కాలువను ఎఇఇ సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ కాలువలో గుడ్లవల్లేరు నుంచి లింగాల వరకు పది కిలోమీటర్ల పొడవునా గుర్రపు డెక్క, తూడు పేరుకుపోయింది. వీటిని తొలగించడానికి ఆపరేషన్ అండ్ మైంటెనెన్సు (ఒ అండ్ ఎం) నిధులు రూ. నాలుగు లక్షలు ప్రతిపాదనలు చేశామన్నారు. మండలంలోని శివారు భూములకు సాగునీటిని అందిస్తామన్నారు. వింజరం వద్ద లాకుల షట్టర్లు మూసివేసి దిగువకు నీరు వెళ్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలోని చిగురుకోట చిన కామనపూడి గ్రామాల్లోని శివారు భూములకు సాగునీరు అందేలా చూస్తున్నామన్నారు. ఆక్వా రైతులు చేపలచెరువులకు నీటిని మళ్లిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు లాక్ సూపరింటెండెంట్ రాణి, లస్కర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వి.క్రాంతికుమార్‌ను సిపిఎం మండల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎస్ఐను బృందం శాలువతో సత్కరించింది. కలిసినవారిలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, సిఐటియు మండల కార్యదర్శి చిట్టిబొమ్మల కొండలరావు, రైతు సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, మండల ధ్యక్షులు దాసరి జానకి రామిరెడ్డి, సహాయ కార్యదర్శి బిక్కిన వీరసత్యం, తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్ పోస్టులకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

శుక్రవారం విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో మండలం నుంచి నలుగురు అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరిలో జీలుగుమిల్లి నుంచి ఊర్ల అరుణ్ తేజ్, అడ్డగర్ల నాగేంద్ర, ములగలంపల్లి రాచూరి కళ్యాణ్, లక్ష్మీపురం నుంచి దాసరి పండు అనే నలుగురు అభ్యర్థులు ఎంపికయ్యారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కాగుపాడు గ్రామానికి చెందిన కడియాల త్రిమూర్తులు తండ్రి విఘ్నేశ్వరరావు పొలం దస్తావేజులు జులై 28వ తేదీ అనగా సోమవారం తీసుకుని నారాయణపురం సొసైటీకి వెళ్తుండగా మార్గమధ్యలో దస్తావేజులు ఉన్న ఫైల్ జారిపోయాయి. **డాక్యుమెంట్ నెంబర్ 2399/2016** కావున డాక్యుమెంట్ ఫైల్ దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌కి అందజేయగలరని కోరుచున్నాను..

కడియాల త్రిమూర్తులు
కాగుపాడు
ఉంగుటూరు మండలం
ఏలూరు జిల్లా
సెల్ నెం: 85007 08737

మహారాజశ్రీ ఏలూరు 7వ అదనపు జిల్లా జడ్జి, ఏలూరు వారి కోర్టులో
ఇ.పి.నెం.125/2021
ఇన్
ఏ.ఆర్.సి.నెం.117/2015

బిట్వీన్ :
మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(ఫార్ములి నౌను అస్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్), చింతలపూడి ...డి.హెచ్.ఆర్
మరియు
ముగ్గల సుభద్ర మరియు ఇతరులు ...జె.డి.ఆర్స్
ఆర్-2: ముగ్గల మాధవి, D/o.లక్ష్మి నారాయణ, హిందూ, ఫిమేల్, వయస్సు 25 సం॥లు, డోర్‌నెం.5-21, మెయిన్ రోడ్, ఎర్రగుంటపల్లి, చింతలపూడి.

పై గ్రంథములో మీ యొక్క వ్యక్తిగతమైన హాజరు నిమిత్తంపైన వివరించిన పిటిషను ది.06-8-2025కి వాయిదా అయి ఉన్నది. ఆరోజు ఉదయం గం.10.30 ని॥లకు పైన వివరించిన కోర్టు వద్దకు మీరు వ్యక్తిగతంగా గాని, మీ లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియపరచవలెను. లేనిచో శ్రీకోర్టు వారి తీసుకునే నిర్ణయం నాకు మీకు అభ్యంతరము లేదని భావించబడును.

Hearing Date : 06-8-2025

K.V.S.N.R.GOPAL
Advocate, Eluru.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS, AT :: VIJAYAWADA
Arbitration Claim Petition No. 91/2024

Between:-
Kapil Chits (Kosta) Pvt. Ltd,
Rep. By it's Zonal Legal Officer,
Governorpeta Branch, Vijayawada.
....Disputant
And
Juttika Aruna Jyothi & Others
...Opponents

Notice to Opponent No. 3
Vanteddu Padmavathi, D/o. Parri Ramu, R/o. D. No. 20E-14-41, Bonu Vari Veedhi, Eluru, Eluru District.
(Opponent No.3)

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honourable Deputy Chit Registrar ordered notice to you and posted the case to 22-08-2025 for your appearance. So you are here by requested to appear before the office of Honourable Deputy Registrar of Chits Vijayawada, D. No. 55-6-7A, Opposite to Priya Childeren Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 on 22-08-2025 at 11-30 A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Honourable Deputy Registrar)
Hearing Date: 22-08-2025

A. Prasoon Kumar,
Advocate
Vijayawada

NOTICE

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), TADEPALLIGUDEM
I.A.No.843/2024 and I.A.No.842/2024 and I.A.No.841/2024
IN
O.S.No.138/2016

Between:
1. Parimi Dinesh ... Petitioner/ Plaintiff
And
1. Parimi Bala Prabhakara Rao and others ...Respondents/defendants

To,
RespondentsNo.11 and No.12
11. Kamma Hemanth Surya Teja, S/o.Kamma Anand Kishore, Age 21 years, Hindu, Male, Student, Door No.1-46-3/3, Konevari street, Opp: Geetha Mandir, 30th ward, Tadepalligudem, TPG-PJCJC.,
12. Nallagopu Vijayalakshmi, W/o.Daiva Vara Prasada Rao, Age 43 years, Hindu, Female, near Rocket Park, old 14th ward, present 7th ward, Tadepalligudem, TPG-PJCJC.,

Please take notice that the above suit is filed by the Petitioners/plaintiffs against the Respondents/defendants. The matter is posted for the appearance of the above respondents No.11 and No.12 on **dt. 11-08-2025 from 10.30 A.M.** onwards, on which day you may appear in person or through your advocate and file your objections/pleadings if any. Otherwise, the matter will be adjudicated according to law in your absence.

G.Syama Prasad Mukherjee,
Tadepalligudem. **N.Surya Mani,** Advocates,
Date: 30-07-2025 Tadepalligudem.